సాక్షి సిద్దిపేట

ఆదివారం : 8 : జూన్ : 2025

సాహో.. సర్కారు బడి

సర్కారు బడులు సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నాయి. కృత్రిమ మేధ.. డిజిటల్ పాఠాలు, నిపుణుల బోధన, ఆట పాటలు, కళల కార్యశాలలు విద్యార్థులను జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దుతున్నాయి. మరోవైపు పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధులతో పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయి. అందుకే 'పిలుస్తోంది సర్కారు బడి'పై ఈ ఆదివారం ప్రత్యేక కథనం..

సండే స్పెషల్

– పాపన్నపేట(మెదక్)

వివరాలు 10లో..



ప్రగతి ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాల

న్యూస్‌రీల్

బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ బడుల్లో చేర్పించండి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



బడిబాటలో పాల్గొన్న డీఈఓ, ఉపాధ్యాయులు

సిద్దిపేటరూరల్: 'ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతోందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని బుస్సాపూర్‌లో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. వారానికి 3 సార్లు గ్రుడ్లతో కూడిన పౌష్టికాహారం, ఉదయం సమయాల్లో రాగిజావ అందించడమే కాకుండా విశాలమైన ఆటస్థలం, సైన్స్, కంప్యూటర్‌ల్యాబ్‌లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఈఓ రాజిరెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి



ఆఫ్ మారథాన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రవీందర్‌రెడ్డి తదితరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఆఫ్ మారథాన్ రన్నింగ్ పోటీల వాల్ పోస్టర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఉదయం నడకతో పాటు రన్నింగ్ చేయాలని సూచించారు. రన్నింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రన్నింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ 5కె, 10కె, 21కె (ఆఫ్ మారథాన్) పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9885886368 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం తదితరులు పాల్గొన్నారు.

మాజీ దళ నాయకుడు మృతి



కోటగల్ల పోశయ్య

కొండపాక(గజ్వేల్): పీపుల్స్‌వార్ గిరాయిపల్లి మాజీ దళ నాయకుడు కోటగల్ల పోశయ్య(66) ఎలియాస్ రాజన్న శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మర్పడ్గ మధిర నాగిరెడ్డిపల్లికి చెందిన పోశయ్య 40 ఏళ్ల కిందట పీపుల్స్ వార్ దళంలో సభ్యునిగా చేరాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ 1987లో దళ నాయకుడిగా ఎన్నికయ్యారు. ఈ హోదాలో మూడేళ్ల పాటు పని చేశారు. తరువాత హైదరాబాద్‌లో కొరియర్‌గా పని చేస్తున్న క్రమంలో అనారోగ్యానికి గురై పోలీసులకు లొంగిపోయారు. దళ నాయకుడిగా పని చేసిన రోజుల్లో భూస్వాముల, పెత్తందారుల ఆగడాలపై, ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాటం చేశారు.



సిద్దిపేట ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు చెబుతూ చిన్నారుల ఆలింగనం

భక్తిశ్రద్ధలతో బక్రీద్

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్‌ను జిల్లాలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే మసీదులు, ఈద్గాల వద్ద సందడి నెలకొంది. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. మత పెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

ముందస్తు పత్తి విత్తు

భారీ వర్షాల కోసం ఎదురుచూపు

- నైరుతి రాకతో పదిహేను రోజుల నుంచే విత్తన ప్రక్రియ
- సాగు అంచనా 1.11లక్షల ఎకరాలు
- అంతా నల్లరేగడి భూముల్లోనే..
- మద్దతు ధర పెంపుతో పెరగనున్న సాగు విస్తీర్ణం



గజ్వేల్ మండలం రిమ్మనగూడలో నల్ల రేగడి భూముల్లో పత్తి విత్తనాలు వేస్తున్న రైతులు

జిల్లాలో పత్తి విత్తనాలు ముందస్తుగా వేసే ప్రక్రియ జోరుగా సాగుతోంది. నైరుతి రాకతో పదిహేను రోజుల నుంచే నల్లరేగడి భూముల్లో పత్తి విత్తన ప్రక్రియ జోరందుకుంది. నిజానికి ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి భారీ వర్షం కురవకపోయినా, నల్ల రేగడి భూములు బెట్టను తట్టుకునే అవకాశమున్నందువల్ల ఈ భూముల్లో మొదటగా పత్తిని విత్తుకుంటున్నారు. సహజంగా ఏటా ఇదే జరుగుతుండగా, ఈసారి ఈ పరిస్థితి మరింతగా ఊపందుకుంది. కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో తాము వేసిన విత్తనం మొలుస్తుందో లేదోనన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

గజ్వేల్: జిల్లాలో ప్రస్తుత వానాకాలానికి సంబంధించి 5.50లక్షల ఎకరాలకుపైగా వివిధ రకాల పంటలు సాగులోకి వస్తాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తున్నది. ఇందులోభాగంగానే పత్తి 1.11లక్షల ఎకరాల్లో సాగులోకి వస్తుందని భావిస్తున్నారు. గతేడాది 1.04లక్షల ఎకరాల్లో మాత్రమే సాగులోకి వచ్చిన ఈ పంట ఈసారి గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే అంచనా విస్తీర్ణంలో ఇప్పటికే సుమారుగా 30శాతానికిపైగా అంటే 35వేల ఎకరాల్లో పత్తి సాగులోకి వచ్చిందని అంచనా. ఇంకా విస్తారంగా వానలు కురవలేదు.

వానల కోసం..

జిల్లాలో మే నెలకు సంబంధించి 23.1మి.మీల సాధారణ వర్షపాతానికి 138.9మి.మీల వర్షపాతం నమోదయ్యింది. జూన్ నెలలో 95.9మి.మీల సాధారణ వర్షపాతానికి ఇప్పటివరకు కేవలం 3.3మి.మీల వర్షపాతం మాత్రమే నమోదయ్యింది. మే రెండు, మూడో వారాల్లో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలను వేయడం ప్రారంభించారు. విత్తనాలు వేసిన తర్వాత పది రోజులగాకుపైగా వర్షాలు ముఖం చాటేయడంతో, వేసిన విత్తనం మొలుస్తుందో లేదోనని రైతుల్లో కలవరం మొదలైంది. భారీ వర్షాలు కురుస్తేనే రైతుల దిగులుకు తెరపడే అవకాశం ఉంది.

నైరుతి రావడంతో మే మూడో వారం నుంచే పత్తి విత్తనాలు వేస్తున్నారు. ప్రత్యేకించి నల్లరేగడి భూముల్లో విత్తనాలు జోరుగా వేస్తున్నారు. వర్షాలు కాస్తా లేటయినా భూములు బెట్టను తట్టుకునే అవకాశమున్నందువల్ల పత్తి విత్తన ప్రక్రియ జోరుగా సాగుతోంది.

మద్దతు ధర పెంపుతో..

గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి సాగు గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈసారి పత్తికి మద్దతు ధర రూ.8,110ను ప్రకటించింది. ఇందులో మీడియం స్టేపుల్‌కు రూ.7,710, లాంగ్ స్టేపుల్‌కు రూ.8,110ధరగా నిర్ణయించిన సంగతి తెల్సిందే. గతేడాదితో పోలిస్తే రూ.580 అదనం. దీంతో రైతులు పత్తివైపు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు అనావృష్టి ఏర్పడే సందర్భంలో బెట్ట పరిస్థితులను తట్టుకునే విత్తన రకాలు పత్తిలో ఎక్కువగా అందుబాటులోకి రావడం వల్ల కూడా రైతులు ఈ పంట వైపు మొగ్గుచూపుతున్నారు. పత్తిని సాగు చేస్తే పెట్టుబడులు పోనూ ఎంతో కొంత మిగులుబాటు ఉంటుందని భావన రైతుల్లో వ్యక్తమవుతోంది.

రైతులు తొందరపడొద్దు



భూమిలో సమృద్ధిగా పదును వచ్చిన తర్వాతే పత్తి విత్తనాలు వేసుకోవడం మంచిది. లేనిపక్షంలో రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. రైతులు ఇప్పటికైనా తొందరపడకుండా భారీ వర్షాలు వచ్చాకే విత్తనం వేసుకోవాలి.

– రాధిక, జిల్లా వ్యవసాయాధికారి

సేద్యంలో రైతే శాస్త్రవేత్త



యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తదితరులు

- త్వరలో ఆదర్శ రైతు వ్యవస్థ, విత్తన చట్టం
- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

హుస్నాబాద్: వ్యవసాయ సేద్యంలో రైతే పెద్ద శాస్త్రవేత్త అని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండో రోజు శనివారం నిర్వహించిన కిసాన్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కోదండ రెడ్డి మాట్లాడుతూ ధరణితో లక్షలాది మంది రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం భూ భారతి తెచ్చి రైతుల ఇక్కట్లను దూరం చేస్తున్నారన్నారు. అలాగే నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ములుగులో కొన్ని మల్టీనేషనల్ కంపెనీలు మొక్కజొన్న విత్తనోత్పత్తి చేసి రైతులను ఆగం చేశాయన్నారు. త్వరలో రైతుకు విత్తన హక్కు కల్పించే విధంగా విత్తన చట్టం తీసుకువచ్చేందుకు కమిటీలు వేశామని తెలిపారు. పసుపు రైతులు యాంత్రీకరణ దిశగా ఆలోచించాలన్నారు. రైతులు సంప్రదాయ పంటలు వేసి ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. రైతుకు కులం, మతం లేదని అందరి వాడని రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. త్వరలో ఆదర్శ రైతు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందని వెల్లడించారు. ఎక్కడెక్కడ ఎలాంటి పంటలు పండుతాయో అక్కడ ఆయా మార్కెట్లు ఉండాలని రైతు కమిషన్ సూచించిందన్నారు. భూ పరీక్ష చేసుకొని అనుకూలమైన పంటలు వేయాలని సూచించారు.

మంచి విత్తనాలు అందిస్తాం

సీడ్ కార్పొరేషన్ ద్వారా మేలైన విత్తనాలు అందిస్తున్నామని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. ప్రైవేట్ కంపెనీల ప్రచారాలకు మోసపోవద్దన్నారు. రాష్ట్రంలో వరి సాగు పెరిగిందని, అయినా ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం కొంటుందన్నారు. పంట మార్పిడి చేసి దిగుబడి సాధించుకోవాలన్నారు. యంత్ర పరికరాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు.

సద్వినియోగం చేసుకోండి

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తీసుకురావడానికే రైతు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ తెలిపారు. ఎవరైనా ఈఎంఐ కింద రుణాలు పొంది యంత్రాలు తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భవానీ రెడ్డి, కేవీఎన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్డీఓ రామ్మూర్తి, ఏఎంసీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

అమ్మకు బోనం



జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కాలనీ ప్రజలంతా కలిసి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ప్రభుత్వ పథకాలపై రచ్చబండ

- ప్రభుత్వ పనితీరుపై ఆరా
- స్వయంగా గ్రామస్తులతో మాట్లాడిన రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

కొండపాక(గజ్వేల్): మర్పడ్గ మధిర నాగిరెడ్డిపల్లిలో శనివారం ప్రభుత్వ పథకాలపై రచ్చబండ నిర్వహించారు. రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు కాంగ్రెస్ బృందం స్వయంగా గ్రామస్తులతో మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బృందం సభ్యులు గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేసిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ధరణి ద్వారా గ్రామాల్లో సమస్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రైతు సంక్షేమం కోసం పని చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంకే సాధ్యమన్నారు.

సింగూరు చేపకు గిరాకి

- మృగశిర కార్తె ఆరంభం నుంచే విక్రయాల సందడి
- ఆస్తమా, ఉబ్బసం వ్యాధులు దరిచేరవని ప్రజల నమ్మకం



సింగూరులో విక్రయానికి సిద్ధంగా చేపలు

పుల్‌కల్(అందోల్): మృగశిర కార్తె ఆరంభం రోజే చేపలు తింటే ఆస్తమా, ఉబ్బసం వంటి వ్యాధులు రావని చాలామంది నమ్ముతుంటారు. ఆదివారం మృగశిర ప్రారంభం కావడంతో చేపలకు మంచి గిరాకీ లభిస్తుంది. ఇక జిల్లాలో సింగూరు చేపకున్న డిమాండ్ అయితే చెప్పనవసరం లేదు.

పసందుగా చేప....

జిల్లాలో ఉన్న ఏకైక భారీ నీటిపారుదల సింగూరు బహుళార్థసాధక ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు జిల్లా ప్రజలకు, జంట నగరాల ప్రజలకు తాగునీటిని, స్థానికంగా సాగునీటిని అందిస్తుంది. జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. అంతేకాకుండా మత్స్యకారులకు ఉపాధిని కల్పించి వారి జీవితాల్లో సిరులు పూయిస్తుంది. ఈ ప్రాజెక్టులో చేపలు పట్టుకుని వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. సింగూరు డ్యాంలో పెరిగే చేపలు రుచికరంగా ఉంటాయని చేప ప్రియులు చెబుతుంటారు. ఇక్కడ పెరిగిన చేపలు హైదరాబాద్‌తో పాటు, జిల్లాలో పలు ప్రాంతాల ప్రజలు ఇష్టంగా తింటారు. ప్రాజెక్టుకు వచ్చిన పర్యాటకులు చాలామంది చేపలు కొని తీసుకెళ్తారంటే అతిశయోక్తి కాదు.

ప్రభుత్వమే చేప పిల్లల విడుదల...

సింగూరు భారీ నీటి పారుదల ప్రాజెక్టు కావడంతో ప్రభుత్వమే చేప పిల్లలను విడుదల చేస్తుంది. ఏటా 60 నుంచి 70 లక్షల చేప పిల్లలను, రొయ్య పిల్లలను విడుదల చేస్తుంది. దీంతో ప్రాజెక్టు పరిసర గ్రామాల ప్రజలు చాలామంది చేపల వృత్తిని ఎన్నుకుని ఉపాధి పొందుతున్నారు.

జోరుగా విక్రయాలు

మత్స్యకారులు పట్టిన చేపలను కొందరు వ్యాపారులు ఆటోల్లో తరలించి సమీప పట్టణాల్లో విక్రయిస్తారు. స్థానికులు మాత్రం అక్కడే ప్రాజెక్టు సమీపంలో షెడ్లు వేసుకుని విక్రయాలు చేపడతారు. మృగశిర నాడు ప్రత్యేక కౌంటర్లు పెట్టి విక్రయాలు చేపడతారు. ప్రస్తుతం డ్యాంలో 18 టీఎంసీల వరకు నీరు ఉండటంతో చేపల సంపద వృద్ధి చెందుతుంది.

ప్రతీ ఊళ్లో అమ్మకాలు

గ్రామాల్లో చెరువుల్ని మత్స్యకారులకే ప్రభుత్వం అప్పగించి, చేప పిల్లలు సరఫరా చేయడంతో ఊరూరా చేపల విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో గ్రామాల్లో జీవించే మత్స్యకారులకు ఉపాధి లభిస్తుంది. సాధారణ చేపలు కిలో రూ.150 కాగా కొర్రమీను లాంటి రకాలు కిలో రూ.350కు విక్రయిస్తారు. మృగశిర నాడు మాత్రం రెట్టింపు ధరలతో విక్రయిస్తారు.

చేపలు పట్టడమే జీవనాధారం

సింగూరు డ్యాంలో చేపలు పట్టి వందల కుటుంబాలు జీవిస్తున్నాయి. చాలా ఏళ్ల నుంచి చేపల వేట ప్రధాన జీవనాధారం. ప్రభుత్వం మత్స్యకారులకు లైసెన్స్‌లు ఇచ్చి పలు ప్రోత్సాహకాలిస్తుంది. పట్టిన చేపల్లో కొన్ని స్థానికంగా విక్రయించి మిగతావి వ్యాపారులకు హోల్‌సేల్ ధరలకు సరఫరా చేస్తాం.

– టేకు లక్ష్మణ్ (మత్స్యకారుడు,సింగూరు)

మార్కెట్ ఏర్పాటు చేయాలి

ప్రాజెక్టులో మత్స్యకారులు మూడు దశాబ్దాలుగా చేపలు పట్టి ఉపాధి పొందుతున్నారు. చేపల మార్కెట్ లేక మత్స్యకారులు దళారులకు సరఫరా చేస్తున్నారు. స్థానికంగా చేపల మార్కెట్ ఏర్పాటుచేయాలి. మత్స్యశాఖకు పట్టున్న సింగూరులో మార్కెట్ ఏర్పాటు చేస్తే మత్స్యకారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– నందికంటి శ్రీనివాస్ (సింగూరు మత్స్యకార సంక్షేమ సంఘం, అధ్యక్షుడు)



వర్గల్‌లో చిన్నారుల అక్షరస్వీకారాల సందడి



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

అక్షరస్వీకారాలు.. సత్యదేవుని వ్రతాలు

కిటకిటలాడిన పుణ్యక్షేత్రాలు

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం శనివారం చిన్నారుల అక్షరస్వీకారాలతో అలరారింది. నాచగిరి లక్ష్మీ నృసింహ క్షేత్రం వ్రతశోభ సంతరించుకున్నది. మరో వారంలో పాఠశాలలు పునఃప్రారంభమవుతుండటంతో రెండో బాసరగా పేరొందిన వర్గల్ సరస్వతి అమ్మవారి సన్నిధిలో చిన్నారుల అక్షరస్వీకారాల సందడి పెరిగింది. ఆలయ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా చిన్నారులకు అక్షరాలు స్వీకారాలు జరిగాయి. అలాగే లక్ష్మీనృసింహుని సన్నిధి సత్యదేవుని వ్రతాలు, కల్యాణాలు, అభిషేకాలు, దర్శనానికి వచ్చిన భక్తులతో నాచగిరి కిటకిటలాడింది. క్షేత్రంలో 54 వ్రతాలు, 9 కల్యాణాలు, 9 అభిషేకాలు, సేవలు జరిగినట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని తరించారు.

క్లుప్తంగా

భూమి విషయంలో వేధింపులు.. వ్యక్తి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): వ్యవసాయ భూమి విషయంలో వేధింపులు భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పులిమామిడి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన కొమ్ము స్వామి(34) తన భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే భూమి విషయంలో గ్రామానికి చెందిన బాలమణితో వివాదం జరుగుతుంది. భూ తగాదా విషయంతో కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉన్న స్వామి శుక్రవారం రాత్రి ఇంట్లోంచి బయటకు వెళ్లి తగాదాలో ఉన్న వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. ఘటనా స్థలానికి ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వచ్చి ఎంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ కోటేశ్వరరావు వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన రామ్ వినయ్ చౌదరి (34) బతుకుదెరువు కోసం ఇద్దరు స్నేహితులతో ఇస్నాపూర్ వచ్చి స్థానికంగా సెంట్రింగ్ కూలీ పనిచేస్తూ ఇస్నాపూర్‌లో ఓ భవనం పెంటహౌస్‌లో ఉంటున్నారు. గత నెల 31న రామ్ వినయ్ ఎప్పటిలాగే పెంటహౌస్ పైకి ఎక్కేందుకు ఉన్న నిచ్చెన ఎక్కి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4న తలనొప్పిగా ఉందని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించుకుని మందులు వాడుతూ గదిలోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. శుక్రవారం ఇద్దరూ స్నేహితులు పనికి వెళ్లి వచ్చి చూసేసరికి ఉలుకు పలుకు లేకుండా ఉన్నాడు. వెంటనే ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాల పాలై..

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై లింగం వివరాల ప్రకారం ... నర్సాపూర్‌లో ఉంటున్న విభీషణ్ రెడ్డి (46) 3వ తేదీన బుల్లెట్‌పై సంగారెడ్డి నుంచి నర్సాపూర్ వస్తున్నాడు. ఈ క్రమంలో మాల్‌వాల ఆయిల్ మిల్ వద్ద వెనక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవరు మృతి

కొండపాక(గజ్వేల్): రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో లారీ డ్రైవరు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై శనివారం రాత్రి 10 గంటలకు చోటు చేసుకుంది. మండల పరిధిలోని గిరాయిపల్లికి చెందిన ముడికే మల్లేశం (54) కొన్నేళ్లుగా సిద్దిపేటలో నివాసం ఉంటూ టింబర్ డిపో యజమాని వద్ద లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి సిద్దిపేట నుంచి కట్టెలలోడ్‌తో లారీని హైదరాబాద్‌కు తీసుకెళ్తూ తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో లారీని పార్కు చేసి నడుచుకుంటూ అవతలి వైపున ఉన్న హోటల్‌కు వెళ్లాడు. టీ తాగి తిరిగి లారీ వద్దకు వెళ్తుండగా సిద్దిపేట నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృత దేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.



పది టాపర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎంపీ రఘునందన్‌రావు (ఫైల్)



పాఠశాలలో యానువల్ డేలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సాహో.. సర్కారు బడి

సరికొత్త ఒరవడిలో ప్రభుత్వ పాఠశాలలు

- కృత్రిమ మేధ..డిజిటల్ పాఠాలు
- ప్రీ ప్రైమరీ నుంచి ఆంగ్ల మాధ్యమం
- పీఎంశ్రీ పాఠశాలలకు రూ.కోటి
- చదువుతోపాటు క్రీడలకూ ప్రాధాన్యం



పాపన్నపేట్ హైస్కూలులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): సర్కారు బడులు విజ్ఞాన శాలలుగా విరాజిల్లుతున్నాయి. బడిలో తొలి అడుగులు ఆంగ్ల మాధ్యమంతోనే ప్రారంభమవుతున్నాయి. పీఎంశ్రీ పథకం కింద మంజూరైన రూ.కోటి నిధులతో పాఠశాలల రూపు రేఖలు మారుతున్నాయి. డిజిటల్ శిక్షణ, కృత్రిమ మేధ, నిపుణుల బోధన, ఆట పాటల మైదానాలు..కళల కార్యశాలలు విద్యార్థులను జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దుతున్నాయి. ఉపాధ్యాయుల అంకిత బోధనతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయి. ఈ యేడు పదో తరగతిలో 96.87 శాతం ఫలితాలతో జిల్లా రాష్ట్రంలో 12వ స్థానంలో నిలిచింది. అందుకే' సర్కార్ బడి పిలుస్తోంది రా' అంటూ ఉపాధ్యాయులు' బడిబాట' పట్టారు.

పీఎంశ్రీ పథకంతో రూ.కోటి

ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైవింగ్ ఇండియా'పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలకు ఐదేళ్లలో రూ.కోటి నిధులు ఇస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు రెండు విడతల్లో 31 పాఠశాలలు ఎంపికయ్యాయి. 24 అంశాల కింద ఐదేళ్లలో రూ.కోటి మంజూరు చేస్తారు. బాలికల్లో ఆత్మరక్షణ, కిచెన్ గార్డెన్, వార్షికోత్సవాలు, విజ్ఞాన యాత్రలు, పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చుకోవడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

పాఠశాలలకు నిధుల వరద

నిధుల వరదతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. సౌకర్యాలు ఒన గూరుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద జిల్లా లోని 562 పాఠశాలలకు రూ.20.62 కోట్లు మంజూరయ్యాయి. వీటితో బడిలో కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. మునుపెన్నడూ లేని విధంగా 10 నెలల పాటు పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పరిరక్షణ కోసం రూ.5.06 కోట్లు మంజూరు చేశారు. సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ పథకం కింద అన్ని పాఠశాలలకు రంగులు, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ యేడు 3కి.మీ దూరం నుంచి బడికి వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ మంజూరు అయింది.

క్రీడల వేదికలు..

ప్రభుత్వ పాఠశాలలు పరిపూర్ణ వికాస కేంద్రాలుగా విరాజిల్లుతున్నాయి. విద్యార్థి నిత్య జీవితంలో ఆటలు భాగస్వామ్యం అవుతున్నాయి. అలాగే వేడుకల వేళ సాంస్కృతిక కార్యక్రమాల ధూం ధాం జోరందుకుంటుంది. వార్షికోత్సవాలు నిర్వహిస్తూ., విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్తున్నారు. చిన్నశంకరంపేట మండలం చందంపేట విద్యార్థిని అర్పిత కళా ఉత్సవ్ కార్యక్రమంలో జాతీయ స్థాయికి ఎంపికైంది. అలాగే మెదక్ టీజీఆర్ఎస్ విద్యార్థిని శ్రీవాణి జాతీయ స్థాయి ఫుట్‌బాల్‌లో పోటీల్లో పాల్గొంది. ఇన్‌స్పైర్ పోటీల్లో పాపన్నపేట మండలం చీకోడ్



కార్పొరేట్‌కు దీటుగా కూచన్‌పల్లి ఉన్నత పాఠశాల

లింగాయపల్లి విదార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈయేడు పదో తరగతిలో తూప్రాన్ టీజీఆర్ఎస్ విద్యార్థి అభిలాష్ 586 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచాడు. 58 పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు.



కృత్రిమ మేధతో కంప్యూటర్ బోధన

డిజిటల్ బోధన

మెదక్ జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలలు, నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు 963 ఉండగా, 93,166 మంది విద్యార్థులున్నారు. ఈ యేడు ఆంగ్ల మాధ్యమంతో కూడిన పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించనున్నారు. భవిష్యత్ అవసరాల కనుగుణంగా డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులపై పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఇందుకు 176 పాఠశాలల్లో బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ కనెక్షన్‌లు సైతం ఇస్తున్నారు. ఇందులో ఎల్ఎంఎస్ సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టడం ద్వారా అన్ని సబ్జెక్టుల కంటెంట్ పొందుపరుస్తున్నారు. కృత్రిమ మేధలో భాగంగా ఏఐఎక్స్ఎల్ ప్రోగ్రాం ప్రారంభించారు. 21 పాఠశాలలను ఎంపిక చేశారు. 40 మందికి పైగా విద్యార్థులున్న మరో 300 పాఠశాలల ఎంపికకు ప్రతిపాదనలు పంపించారు. ఎక్‌స్టెప్ సంస్థ ఆధ్వర్యంలో ఆంగ్లం, తెలుగు చదవడం, రాయడంతో పాటు గణితంలో కూడా కనీస సామర్థ్యాలు సాధించేలా కంప్యూటర్ పరిజ్ఞానం అందిస్తున్నారు.

బంగారు భవిష్యత్ అందిస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బంగారు భవిష్యత్ అందిస్తాం. నిష్ణాతులైన టీచర్లతో విద్యాబోధన చేయిస్తున్నాం. బాల్యం నుంచే ఇంగ్లిష్ మీడియం, ఏఐ(కృత్రిమ మేధ) పాఠాలు, డిజిటల్ విద్య, ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా మనసుకు హత్తుకునేలా పాఠ్యాంశాల వివరణ. ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ , మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రవాణా ఖర్చులు అందిస్తాం. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపండి..బాధ్యత మాది. స్థాయికి తగ్గ సామర్థ్యాలు అందిస్తాం. – రాధాకిషన్, డీఈఓ, మెదక్

75 ఏళ్ల కల మోదీతో సాకారం

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ

మర్కూకు(గజ్వేల్): చీనాబ్ నదిపై వంతెన నిర్మించి ప్రధాని నరేంద్ర మోదీ 75 ఏళ్ల కలను సాకారం చేశారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. వంతెనతో జమ్మూ కశ్మీర్‌ను భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు అనుసంధానం చేసిన ఏకైక నాయకుడని కొనియాడారు. మండలంలోని పాములపర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటన జరిగిన తర్వాత ఈనెల 6న ప్రధాని జమ్మూ కశ్మీర్ పర్యటనను ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా చూసిందని, పాకిస్తాన్ మాత్రం తుపాకులతో బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామ్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్తయ్య, శ్రీనివాస్ గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్‌లో రాణించిన క్రీడాకారులు



ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రీడాకారులు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర స్థాయి 46వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని మండల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మనోహర్ శనివారం తెలిపారు. నల్లగొండ జిల్లా మంగళపల్లిలో నాలుగు రోజులుగా జరిగిన పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సిద్దిపేట జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ గుప్తా, హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాసు గౌడ్, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేషం , జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులు మహమ్మద్, ఇంతియాజ్, కనకయ్య, తదితరులు అభినందించారు.

గేదెలను కడిగేందుకు వెళ్లి యువకుడు మృతి



శేఖర్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): గేదెలను కడిగేందుకు వెళ్లిన యువకుడు ఈత రాకపోవడంతో కుంటలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలం ఫైజాబాద్ శివారులో జరిగింది. ఎస్ఐ నర్సింహులు వివరాల ప్రకారం... మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామానికి చెందిన దారా శేఖర్ (24) ఫైజాబాద్ గ్రామానికి చెందిన టేకుల నర్సింహా రెడ్డి వద్ద గేదెలు మేపడానికి జీతం ఉన్నాడు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులో గేదెలను మేపేందుకు తీసుకెళ్లాడు. రాత్రి గేదెలు ఇంటికి వచ్చాయి. కానీ అతడు మాత్రం రాలేదు. విషయాన్ని నర్సింహా రెడ్డి శేఖర్ కుటుంబసభ్యులకు తెలియజేశాడు. వారు వస్తాడులే అని ఊరుకున్నారు. శనివారం ఉదయం నర్సింహా రెడ్డి, శేఖర్ అన్న రవి గ్రామ శివారులో వెతుకుతుండగా వడ్లోని కుంటలో శేఖర్ మృతదేహం కనిపించింది. గేదెలను కడిగేందుకు, బట్టలు, మొబైల్‌ను గట్టునపెట్టి కుంటలోకి దిగాడు. జేసీబీ గుంతని గుర్తించని శేఖర్ ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడని పోలీసులు భావిస్తున్నారు. తండ్రి హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి



ట్రాక్టర్ బోల్తాపడి మృతి చెందిన రైతు బాపురెడ్డి

కొండపాక(గజ్వేల్): వ్యవసాయ పనులకు ట్రాక్టరు తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తాపడటంతో రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ హృదయ విదారకర ఘటన సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో సిర్సనగండ్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దేవిరెడ్డి బాపురెడ్డి (47) తన సొంత ట్రాక్టరును పొలం దున్నేందుకు తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కాలువ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజిన్ కాలువలో బోల్తాపడింది. దీంతో ఆయన ఇంజిన్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు నెలల క్రితం బాపురెడ్డి కుమారుడు ఉదయ్ కుమార్‌రెడ్డి స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై దుద్దెడలో ఓ వివాహానికి హాజరై వస్తున్నారు. ఈ క్రమంలో సిర్సనగండ్ల గ్రామ శివారులో డివైడర్‌ను ఢీకొట్టి కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి నుంచి తల్లి దండ్రులు తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుమున్నాయి.

ట్రాక్టర్ ఢీకొని రైతు..

నారాయణఖేడ్: ట్రాక్టరు ఢీకొని రైతు మృతి చెందాడు. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి వివరాల ప్రకారం.. ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన బాలయ్య(50) తన పొలం దున్నడానికి ట్రాక్టరును అద్దెకు తీసుకున్నాడు. అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బాగయ్య ట్రాక్టరుతో పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు బాలయ్యను ఢీకొట్టడంతో మృతి చెందాడు. వర్షాకాలం పంటల సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని చిల్వర్ 161 జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... మహారాష్ట్రకు చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై నాందేడ్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై బొలెరో వాహన డ్రైవర్ నిర్లక్ష్యంగా రివర్స్ తీస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నాందేడ్‌కు చెందిన మహేష్ అక్కడికక్కడే మృత్యువాత పడగా, మరో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి...

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఉత్తులూర్ వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ.ప్రవీణ్‌రెడ్డి వివరాల ప్రకారం... పెద్దశంకరంపేట వైపు వస్తున్న మహీంద్రా థార్ ఎదురుగా బైక్‌పై వస్తున్న వెల్పుగొండ గ్రామానికి చెందిన కోటగిరి శివగౌడ్(52)ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

దుబ్బాకటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. రాయపోల్ పోలీసుల వివరాల ప్రకారం... గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కర్కాల రామ్మోహన్ రెడ్డి (44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి బయటికి వెళ్లి వస్తానని భార్యకు చెప్పి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని కొండపోచమ్మ కెనాల్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్మోహన్ రెడ్డి తలకు, ఛాతీ భాగంలో తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

చేర్యాల(సిద్దిపేట): విద్యుదాఘాతానికి గురై పాడి ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని నాగపురిలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కాట తిరుపతికి చెందిన పాడి ఆవు మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. రూ.90వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

దుబ్బాకటౌన్: ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం రాయపోల్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన కిశోర్ రెడ్డి అతడి స్నేహితుడు వాసు నాయక్‌తో కలిసి దౌల్తాబాద్ నుంచి గజ్వేల్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో రాయపోల్ జెడ్పీ ఉన్నత పాఠశాల దుర్గమ్మ గుడి మూలమలుపు వద్ద అతివేగంగా ద్విచక్ర వాహనం నడుపుకుంటూ చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి.చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పాప ప్రాణం తీసిన కారు

వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి



అర్చన (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పటి వరకు అక్కా తమ్ముళ్లతో ఆడుకున్న పాప ప్రాణం రోడ్డు ప్రమాదంలో పోవడంతో కుటుంబ సభ్యుల రోదన అందరినీ కంటతడి పెట్టించింది. నర్సాపూర్ – తూప్రాన్ రహదారిపై హనుమంతపూర్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిందం అర్చన (9) అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం... నర్సాపూర్‌కు చెందిన చిందం అర్జున్ కుటుంబ సభ్యులతో కలిసి హనుమంతపూర్ సమీపంలో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. సాయంత్రం తల్లి లలిత కూతురు అర్చనతో కలిసి నర్సాపూర్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు కాలినడకన బయలుదేరారు. తూప్రాన్ వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు అర్చనను వెనుక నుంచి ఢీకొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. ఆ సందర్భంలో తల్లి కేకలు పెడుతూ బిడ్డను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రాణాలు వదిలింది. అర్జున్ లలిత దంపతులకు నలుగురు సంతానం కాగా పెద్ద కూతురు ఉజ్వల, రెండో కూతురు అర్చన , రిషి, విశాల్ ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలి

- జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు
- 18న హైదరాబాద్‌లో బహిరంగ సభ



మాట్లాడుతున్న ఆర్టిజన్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్ రావు

మెదక్ కలెక్టరేట్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో ఆర్టిజన్‌ల జిల్లా సమావేశం జరిగింది. జిల్లా చైర్మన్ స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టిజన్ కార్మికుల విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నా.. ప్రభుత్వం, మేనేజ్మెంట్ పట్టించుకోవడం లేదన్నారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 18న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు విద్యుత్ సంస్థ మేనేజ్మెంట్‌లకు కన్వర్షన్ కోసం సమ్మె నోటీసు ఇస్తామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి సమస్యను జేఏసీతో చర్చించి పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చంద్రారెడ్డి, సిద్దిపేట జిల్లా చైర్మన్ సధాకర్, జిల్లా కో కన్వీనర్ సందీప్, సంగారెడ్డి జిల్లా చైర్మన్ రాములు, జిల్లా కన్వీనర్ దుర్గయ్య, ఉమ్మడి మెదక్ జిల్లా జేఏసీ నాయకులు కనకరాజు, రవికుమార్, జీన్నా, నాగరాజు, సురేష్, నర్సింహులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



బాలరాజు(ఫైల్)

పాపన్నపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి నీట మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పొడిచన్‌పల్లి శివారులోని గండం చెరువులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం ... గ్రామానికి చెందిన భామిని బాలరాజు (29) చేపల వేటతో పాటు, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మృగశిర కార్తె కావడంతో చేపలు పట్టి అమ్ముకుందామని తోటి వారితో కలిసి, గండం చెరువుకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. అక్కడున్న వారు రక్షించే లోపలే చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వల చుట్టుకొని మత్స్యకారుడు..



యాదగిరి (ఫైల్)

నర్సాపూర్ రూరల్: మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లి వల చుట్టుకొని మృతి చెందాడు. ఈ ఘటన నర్సాపూర్ రాయరావు చెరువులో జరిగింది.వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుద్దాల యాదగిరి (45) శనివారం సాయంత్రం చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి వల చుట్టుకొని మృత్యువాతపడ్డాడు. ఆదివారం మృగశిర కార్తె కావడంతో చేపలు పట్టుకు వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లినట్లు మృతుడి భార్య రాంబాయి తెలిపింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

కిసాన్ మేళాలో రైతుల సందడి



పంపు సెట్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రెండో రోజు శనివారం కొనసాగిన కిసాన్ మేళాకు భారీ సంఖ్యలో రైతులు తరలివచ్చి సందడి చేశారు. స్టాళ్లలో ప్రదర్శించిన వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, చేపలు, డ్రోన్లు, ట్రాక్టర్లు తదితర వాటిని రైతులు ఆసక్తిగా పరిశీలించి, వినియోగం, ప్రయోజనాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

సోలార్ వినియోగంతో ఖర్చులు ఆదా

సోలార్ పవర్ నెట్‌మీటరింగ్ పద్ధతి అనుసరించడం ద్వారా వంద శాతం విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. సౌరశక్తి ఉత్పత్తి సహజ సిద్ధ నిరంతర ప్రక్రియే అయినప్పటికీ ప్రారంభ పెట్టుబడి ఉన్నప్పటికీ నిర్వహణ ఖర్చు తక్కువేనని పేర్కొన్నారు. మార్కెట్‌లోకి వస్తున్న అనేక రకాల విత్తనాల్లో మేలు రకమైన వాటిని గుర్తించాలని, నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోతున్నారని పలు విత్తన స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు. దీని నివారణకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలను సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ మోటర్లు ఐఎస్ఐ మార్క్ ఉన్న వాటినే వినియోగించాలని కూడా సూచించారు. రాష్ట్రంలో చేనేత, మరమగ్గ కార్మికుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత అభయ హస్తం పథకం మంచి ఫలితాన్నిస్తుందన్నారు. చేనేత కార్మికుల ఉత్పత్తులను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి సరఫరా చేస్తుండటంతో వారికి ప్రయోజనం కలుగుతోందన్నారు.